యువత చదువుతో పాటు క్రీడలో రాణించాలి

నవతెలంగాణ-నార్నూర్

యువత చదువుతో పాటు క్రీడలో రాణించాలని దివ్య శ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. మండలంలోని కొత్తపెల్లి-హెచ్ దీక్ష భూమి జాతరలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతి నాగల్‌కొండ టీమ్‌కు రూ.21వేలు, రెండో బహుమతి కొత్తపెల్లి టీమ్‌కు రూ.11వేలు అందించారు. ఆయన వెంట గ్రామ పెద్దలు ఉన్నారు.



పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేత

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి) గ్రామ ఉన్నత పాఠశాలకు బుధవారం రిటైర్డ్ టీచర్ రామ్‌చందర్‌గౌడ్ మినరల్ వాటర్ ప్యూరిఫైయర్ మిషన్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాల నిమిత్తం రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పిల్లలందరికీ శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో సుమారు రూ.30 వేల విలువ గల వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేశారు. గంటకు 50లీటర్ల శుద్ధ నీటిని అందజేసే శుద్ధ జల యంత్రాన్ని పాఠశాలకు అందించడం ఆనందంగా ఉందన్నారు. దాతను ఏంఈఓతోపాటు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కూన రమేష్, ఉపాధ్యాయ బృందం, వీడీసీ కమిటీ సభ్యులు అభినందించారు.



ఆర్టీసీకి పండగ ఆదాయం..!

- 13రోజుల వ్యవధిలో రూ.19.99కోట్ల లాభం
- నిర్మల్ డిపో పరిధిలో అధికం..ఉట్నూర్‌లో అత్యల్పం
- ఫలించిన అధికారుల కృషి..కార్మికుల కష్టం
- ప్రయాణికులను చేరవేసేందుకు అదనపు బస్సులు
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 600బస్సులు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ(టీజీఆర్‌టీసీ)కి సంక్రాంతి పండగ ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. 13రోజుల వ్యవధిలో ఏకంగా రూ.19.99కోట్ల ఆదాయం సమకూరింది. పండగకు వారం రోజుల ముందు..ఆ తర్వాత కూడా ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరవేయడంతో చేపట్టిన చర్యలు ఆ సంస్థకు ప్రయోజనం చేకూర్చింది. ఆ సంస్థ అధికారుల కృషి..కార్మికుల కష్టం కారణంగా ఆర్టీసీ లాభాల బాటన పయనించేందుకు కారణమైంది. పండగ రోజుల్లో ఆర్టీసీ బస్టాండ్‌లు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం కూడా భారీగా ఆదాయం రావడానికి ఓ కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పండగ సమయాల్లో ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చడమే లక్ష్యంగా ఆ సంస్థ రూపొందించిన ప్రణాళిక..ఇందుకనుగుణంగా తీసుకున్న ప్రత్యేక చర్యలు ఫలితానిచ్చాయని అధికారులు చెబుతున్నారు.మరోపక్క అదనపు బస్సులు(ఎక్స్‌ట్రా) నడిపించడంతో మూడు రోజుల పాటు అదనపు ఛార్జీలు వసూలు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ రవాణా సంస్థ (ఆర్టీసీ)కి సంక్రాంతి పండగ భారీ ఆదాయాన్ని తీసుకొచ్చింది. పండగ ప్రజల్లోనే కాకుండా ఆ సంస్థలోనూ నూతన కాంతిని నింపింది. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యలు..అధికారుల పక్కా ప్రణాళిక.. ఆ సంస్థ కార్మికుల శ్రమ ఫలితంగా ఆ సంస్థ పండగ లాభాలతో ప్రయోజనం పొందింది. పండగకు వారం రోజుల ముందు.. పండగ ముగిసిన మరో వారం రోజుల పాటు ఆర్టీసీ బస్టాండ్‌లన్ని ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విద్యార్థులు, అక్కడ నివసిస్తున్న జిల్లావాసులను పండగకు ఆదిలాబాద్ తీసుకొచ్చేందుకు ఆ సంస్థ కృషిచేసింది. రోజువారీగా నడిపించే బస్సులతో పాటు రాష్ట్ర రాజధానిలో సుమారు 100బస్సులను అక్కడ్నుంచి అదనంగా నడిపించింది. సమన్వయం కోసం ప్రత్యేకంగా ఓ అధికారిని అక్కడి జేబీఎస్‌లో బస్టాండ్‌లో విధులు కేటాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రయాణికులు హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చేందుకు మార్గం సుగుమంగా మారింది. పండగ ముగిసిన తర్వాత కూడా వారిని ఇక్కడ్నుంచి ఆయా ప్రాంతాలకు పంపించేందుకు ప్రత్యేక బస్సులు నడిపించడం మూలంగా ప్రయాణికులు క్షేమంగా గమ్య స్థానాలకు చేరారు. ఇటు ప్రయాణికులకు సేవలు అందించడంతో పాటు సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడం ద్వారా సత్ఫలితాలు కనిపించాయి.

నిర్మల్ డిపోలో అత్యధికం..!

తెలుగు ప్రజలకు సంక్రాంతి పండగ అంటే ప్రత్యేకత ఉంటుంది. ప్రభుత్వం సైతం సుమారు వారం రోజుల పాటు సెలవులు మంజూరు చేయడంతో అనేక మంది వారి సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ సంస్థ ఈ నెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడిపించింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆరు డిపోలు ఉండగా సుమారు 600 వరకు బస్సులు ఉన్నాయి. పండగ సమయంలో 13రోజుల వ్యవధిలో సంస్థకు ఏకంగా రూ.19.99కోట్లు ఆదాయం సమకూరింది. ఇందులో నిర్మల్ డిపో పరిధిలో అత్యధికంగా రూ.5.2కోట్లు ఆదాయం సమకూరగా..అత్యల్పంగా ఉట్నూర్ డిపో నుంచి రూ.1.03కోట్లు ఆదాయం వచ్చింది. మిగితా ఆదిలాబాద్ డిపో పరిధిలో రూ.4.31కోట్లు, భైంసా డిపో పరిధిలో రూ.2.08కోట్లు, ఆసిఫాబాద్ పరిధిలో రూ.2.72కోట్లు, మంచిర్యాల డిపో పరిధిలో రూ.4.61కోట్ల ఆదాయం సమకూరింది.







ముందుగానే సన్నద్ధమయ్యాం :

సోలోమాన్, ఆర్టీసీ ఆర్ఎం

సంక్రాంతి పండగకు బస్సులు నడిపించే విషయమై సంస్థ ఉన్నతాధికారుల సూచనతో నెల రోజుల ముందుగానే సన్నద్ధమయ్యాం. ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చడమే లక్ష్యంగా పనిచేశాం. హైదరాబాద్ నుంచి ఇక్కడకు రప్పించేందుకు 100అదనపు బస్సులు నడిపించాం. ఫలితంగా మంచి ఆదాయం వచ్చింది. ఇందులో సంస్థ అధికారులు, కార్మికులు, సిబ్బంది కృషి చాలా ఉంది.

అహోరాత్రులు శ్రమించిన కార్మికులు..!

ఆర్టీసీ సంక్రాంతి పండగ సమయంలో ఆదాయం సమకూర్చేందుకు ఆ సంస్థ కార్మికుల కృషి చాలా ఉంది. అహోరాత్రులు శ్రమించి ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేరవేశారు. అధికారుల సలహాలు, సూచనలతో ఎక్స్‌ట్రా విధులు నిర్వర్తించి బస్సులను నడిపించారు. అనేక మంది కార్మికులు ఇంటికి వెళ్లకుండా ఓపికతో డబుల్ డ్యూటీలు నిర్వర్తించారు. ఆ సంస్థ అధికారులు సైతం సంస్థకు ఆదాయం తీసుకొచ్చేందుకు కార్మికులను సమన్వయం చేస్తూ విధులు నిర్వర్తించారు. బస్టాండ్‌లోనే కార్మికులకు భోజన సౌకర్యం కల్పించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కల్గొద్దు

- వేలాల జాతరపై అధికారులతో ఎమ్మెల్యే వివేక్ సమీక్ష



నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని వేలాల మల్లికార్జున స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గొద్దని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి బుధవారం అధికారులతో సమీక్షించారు. వేలాల జాతరకు లక్షల్లో భక్తులు తరలి వస్తారని, వారికి వసతుల కల్పనలో అధికారులు ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గోదావరి నదీ స్నానం కోసం వచ్చే భక్తుల అవసరాల మేరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వీఐపీల వాహనాలను సైతం గుట్టపైకి అనుమతించరాదని తెలిపారు. భక్తులకు తాగు నీటి వసతితో పాటు అవసరమైన ప్రదేశాల్లో టెంట్లు వేయించాలని ఆదేశించారు. అనంతరం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు ఎమ్మెల్యే, కలెక్టర్, డీసీపీ, ఏసీపీని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ రమేష్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఫిర్యాదు

ప్రతి ఏడాది రూ.50 లక్షలకు తగ్గకుండా జాతర ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని బీజేపీ నాయకులు వేముల తిరుపతిగౌడ్, ప్యాగ మొగిలి, ప్యాగ చెందు, చకిలం ప్రవీణ్, పాగ లవ కుమార్ ఎమ్మెల్యే వివేక్‌కు ఫిర్యాదు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా మల్లికార్జున స్వామి దర్శనార్థం 3 నుండి 4 లక్షల మంది భక్తులు వేలాల జాతరకు వస్తారని, వారికి వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులు సమర్పించే కట్నకానుల రూపంలో ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించారు. సౌకర్యాల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : కమిషనర్ సతీష్



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని మున్సిపల్ కమిషనర్ సతీష్ అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణుతో కలిసి మున్సిపాలిటీ పరిధిలో 9నుండి 16వ వార్డులలో ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులలో పిల్లల పేర్లు నమోదుకు, ఆత్మీయ, రైతు భరోసా కోసం వార్డు కమిటీ సమావేశం నిర్వహించారు. వార్డు సభల్లో ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డు, రైతు భరోసా దరఖాస్తులపై వార్డు కమిటీలో చర్చించి అర్హుల పేర్లు చదివి వినిపించారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తులు అందజేస్తే విచారణ చేపట్టి జాబితాలో చేరుస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గెల్లు రజిత, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, అగ్రికల్చర్ ఆఫీసర్, మున్సిపల్ ఏఈ డి.మధు, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఖందేవ్ జాతరలో బుధవారం ఆలయ కమిటీ సభ్యులు కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహ సంబంధంతో పాటు మానసిక ఉల్లాసం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావ్, దివ్య శ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్, మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రూపదేవ్, నాయకులు ఉత్తం, పూసం ఇశ్రు, మడావి రూపదేవ్, దాదిరావ్, దీపక్ ఉన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంపై కళాజాత బృందం అవగాహన

నార్నూర్: సంపూర్ణ ఆరోగ్యంపై బుధవారం కళాకారులు కళాజాత బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జాతరతో పాటు మండలంలోని మల్కుగూడ, కొత్తపల్లి-హెచ్ ఎస్సిగూడ, భీంపూర్ గ్రామంలో నేషనల్ హెల్త్ మిషన్, రోడ్డు భద్రత, డ్రగ్స్, క్షయ, డెంగ్యు, మలేరియా, మన తెలంగాణ మన వ్యవసాయం, మాదకద్రవ్యాలు, కుటుంబ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ తులసీదాస్, హెల్త్ సూపర్ వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, వైద్య సిబ్బంది విలాస్, జవహర్, గోకుల్, తెలంగాణ సాంస్కృతిక సారథి కో ఆర్డినేటర్ ఆత్రం గోవిందరావ్, రాథోడ్ శంకర్, ఆశిష్, నగేష్, దుర్పతబాయి ఉన్నారు.

యువతిని మోసం చేసిన కేసులో ఒకరి రిమాండ్

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన కేసులో మల్లెపూల వంశీకుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..మాయ మాటలు చెప్పి కొన్నేళ్లుగా పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడు. బాధిత యువతి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మల్లెపూల సత్యనారాయణ, భూలక్ష్మి, లింగారెడ్డి, రాములుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

- పలు చోట్ల పోలీసు బందోబస్తు మధ్య గ్రామ సభలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని కేస్లాపూర్, ముత్నూర్, గౌరాపూర్, మెండపల్లి, వాల్గోండ గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరాలు చెప్పారు. మండల కేంద్ర మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభకు మండల ప్రత్యేకాధికారి రాథోడ్ రవీందర్ హాజరయ్యారు. ఉదయం 9గంటలకు జరగాల్సిన గ్రామ సభకు ప్రజలు రాకపోవడంతో గంట ఆలస్యంతో నిర్వహించారు. ముందుగా పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను చదివి వినిపించగా బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సభలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని అనడంతో కొంతసేపు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం మండల ప్రత్యేకాధికారి రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరి నుండి దరఖాస్తు స్వీకరిస్తామని తెలిపారు. ఈ క్రమంలో తన పేరు లబ్ధిదారుల జాబితాలో రాలేదని ఓ మహిళ అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఉపాధి హామీ పథకంలో చేసిన పనికి డబ్బులు రాలేదంటూ ఆరోపించింది. జాబితాలో అర్హులు పేర్లు లేకపోతే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో పెద్ద సంఖ్యలో బారులు తీరారు. కౌంటర్ వద్ద కిక్కిరిసిపోయారు. ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఈవో సంజీవ్‌రావు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్

భీమారం గ్రామ సభలో గందరగోళం

జైపూర్ : ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన సంక్షేమ పథకాల్లో అర్హులైన వారికి అన్యాయం జరుగుతోందని భీమారం గ్రామానికి చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో బుధవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. నాలుగు పథకాలకు అర్హులైన వారి పేర్లు లేకపోవడం గ్రామస్తులు ఆందోళన చెందారు. రీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ విధివిధానాలు చెప్పాలని గ్రామస్తులు కోరారు. రేషన్‌కార్డుల జారీలో అనర్హుల పేర్లు జాబితాలో ఉండడంతో అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ సభలో ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కల్పన, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ మధుసూదన్, వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పథకాల విషయంలో ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన వారికి అన్యాయం జరగదని తెలిపారు. వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు ఎంత మందికి ఇస్తారనే విషయంలో తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. మండల పరిధిలో 4,671 మంది అర్హులుగా గుర్తించినప్పటికీ 4,425 కుటుంబాలకు సంబంధించిన సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీఓ మధుసూదన్ తెలిపారు. గ్రామ సభకు ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాంసి : మండలంలోని వడ్డాడిలో బుధవారం డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్సై రాధిక ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ గ్రామసభ గందరగోళంగా కొనసాగింది. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రైతు కూలీల జాబితాను అధికారులు చదువుతుండగా గ్రామస్తులు ఒక్కసారిగా కలుగజేసుకొని ఈ జాబితాలో అర్హులైన వారి పేర్లు లేకపోవడమేంటని ప్రశ్నించారు. భూములు ఉన్న వారి పేర్లు కూలీల జాబితాలో ఉన్నాయన్నారు. ప్రతి సంవత్సరం ఉపాధి పనులకు వెళ్లే వారి పేర్లు లేవని అధికారులపైకి దూసుకు రావడంతో డీఎస్పీతో పాటు స్థానిక పోలీసులు రంగంలోకి దిగి గ్రామస్తులకు నచ్చజెప్పారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి దరఖాస్తులను స్వీకరించారు. గ్రామ సభ కొనసాగించారు.





తాంసి :

గ్రామ సభలపై కలెక్టర్ సంతృప్తి



నవతెలంగాణ-బేల

మండలంలోని డోప్టాల, చంద్‌పల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా హాజరై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12వేలు ఇస్తుందన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మనోహర్‌రావు, ఎంపిడిఓ మహేందర్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, సీఐ సాయినాథ్, ఎస్సై దివ్యభారతి పాల్గొన్నారు.

ఇచ్చోడ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద గ్రామ సభను సీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడివో లక్ష్మణ్ మాట్లాడుతూ మండలంలో గ్రామ సభలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయన్నారు. రెండు రోజులుగా 24 గ్రామాల్లో గ్రామ సభలు కొనసాగాయి. ఇందిరమ్మ ఇండ్లకు 833, రేషన్ కార్డులు 1696, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 553, రైతు భరోసాకు 2, మొత్తం 3084 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ- నిర్మల్‌టౌన్

ఈ నెల 25న జిల్లాలోని అన్ని యాజమాన్యం పాఠశాలలు జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డిఇఓ రామారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారుల సమక్షంలో గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఓటు ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. ప్రదర్శనలు, జాతీయ ఓటర్ ప్రతిజ్ఞ, ఎస్సే రైటింగ్, క్విజ్ తదితర పోటీలను నిర్వహించాలని ఆదేశించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | జనవరి 23, 2025 | www.navatelangana.com

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నేరడిగొండ



నవతెలంగాణ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరి ప్రభావాలకు లొంగకుండా సమస్యల పరిష్కారానికి దూరదృష్టితో ఆలోచించి నవతెలంగాణ పని చేస్తుందన్నారు. ఎటువంటి సమస్యలనైనా వెలికి తీసి ప్రభుత్వాలకు తెలియజేస్తూ ప్రభుత్వాలు ఇచ్చే హామీలను ప్రజల గొంతుకై వినిపించే పత్రికని కొనియాడారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎండి సద్దాం, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన డీఈఈ

నవతెలంగాణ-ముథోల్



ముథోల్ నుండి వాటోలి వరకు రూ.30 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను భైంసా డివిజన్ ఆర్అండ్‌బీ డీఈఈ సునీల్ కుమార్ బుధవారం పరిశీలించారు. నిర్మిస్తున్న రోడ్డుకు కొలతలు చెప్పట్టారు. రోడ్డుపై అక్కడక్కడ నిర్మిస్తున్న కల్వర్టులను పరిశీలించి సూచనలు చేశారు. రోడ్డు పనుల్లో మరింత వేగాన్ని పెంచి వాహన దారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలన్నారు. పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలుంటాయని హెచ్చరించారు.

ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నియోజకవర్గంలోని ప్రతి గ్రామినికి రోడ్డు సౌకర్యాలు కల్పించేల కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గడిచిన సంవత్సర కాలంలో నిర్మల్ నియోజకవర్గ పరిధిలో రూ.వందల కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరుతాయని పేర్కొన్నారు. హామీలను నెరవేర్చడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసేల కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నవతెలంగాణ-బేల

ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం రాష్ట్ర తెలంగాణ ప్రయివేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్(టీపీడీఎంఏ) పిలుపు మేరకు వారం రోజుల శాంతియుత నిరసన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పుష్ప మాట్లాడుతూ సంవత్సరం నుండి వేతనాలు లేక అద్దె కట్టలేక తీవ్ర ఇబ్బందవుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఫీ రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలేజ్ లీగల్ అడ్వైసర్ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి సాగర్, అధ్యాపకులు బిందు, సౌందర్య, ఆమోల్, సంజీవ్ రెడ్డి, కిష్టారెడ్డి, ప్రియాంక పాల్గొన్నారు.

తర్నం(కె)లో వైద్య శిబిరం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తర్నం(కె) గ్రామంలో బుధవారం హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. సరైన సమయంలో పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వాణి, ఏ.నరేందర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం గంగమణి, ఆశా వర్కర్ ఆనంద, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెరిగిన డీఏకు అనుగుణంగా రన్నింగ్ అలవెన్స్ పెంచాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైల్వేలో పని చేస్తున్న లోకో పైలట్లకు పెరిగిన డీఏకు అనుగుణంగా రన్నింగ్ అలవెన్స్ పెంచాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ అన్నారు. బుధవారం రైల్వే స్టేషన్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే లోకో పైలట్ గార్డ్‌కు కిలోమీటర్ అలవెన్స్ 25 శాతం పెంచాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ అన్నారు. రైల్వే సిబ్బంది అందరికి డీఏ 50 శాతం పెంచి టీఏ సైతం పెంచారన్నారు. కానీ లోకో పైలట్లకు గార్డ్స్‌కు అన్యాయం చేశారన్నారు. పెంచిన డీఏకు అనుగుణంగా కిలోమీటర్ అలవెన్స్ 25 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అశిష్ రంజన్, సిరాజ్ ఆలం, రింకు కుమార్, డీఎస్ రాజు, హేమంత్ కుమార్, ఆశిష్ దోకే పాల్గొన్నారు.

దేవరకోట ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని పురాతన దేవరకోట శ్రీవరలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని చేపట్టిన లెక్కింపులో మొత్తం రూ.5,41,214 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భూమయ్య తెలిపారు. ఇందులో ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్, ఆలయాల డివిజన్ ఇన్స్‌పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.



గ్రామసభల్లో గందరగోళం

- తమ పేర్లు రాకపోవడంతో లబ్దిదారుల ఆందోళన
- ఎన్నిసార్లు దరఖాస్తులు తీసుకుంటారని ఆక్రోశం



కుభీర్ : అధికారులను నిలదీస్తున్న లబ్దిదారులు

నవతెలంగాణ-కుభీర్

ప్రభుత్వ పథకాలకు లబ్దిదరుల ఎంపిక కోసం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలానే ఉద్యేశంతో ప్రభుత్వం మండలంలో అన్ని గ్రామంలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తోంది. రెండో రోజు బుధవారం మండలంలోని పార్డి(బి) గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభ సమావేశానికి గ్రామ ప్రత్యేక అధికారి, వ్యవసాయ విస్తీరణ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు హాజరై సమావేశం ప్రారంభించారు. దీంతో ఆయా శాఖలకు చెందిన అధికారులు రేషన్ కార్డులు, ఇందిరమ్మ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాను చదివి వినిపంచారు. దీంతో తమ పేర్లు లేకపోవడంతో ప్రజలు ఒక్కసారిగా అధికారులపై విరుచుకు పడ్డారు. గ్రామ నాయకులు కొందరు గ్రామ సభలో రేషన్ కార్డులు పూర్తి స్థాయిలో మంజూరు చేస్తేనే గ్రామ సభ నిర్వహించాలనని తేల్చి చెప్పారు. తహసీల్దార్, ఆర్డీఓ పిలవాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డులు లేని ప్రతి ఒక్కరికి దగ్గర ఉండి చేపిస్తానని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. రైతు భరోసా, ఇందిరమ్మ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తు చేసుకొని వారికి ఇప్పుడు ధరకాస్తులు చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఎన్నో సార్లు దరఖాస్తులు ఇచ్చామని ఇంకేన్ని సార్లు ఇవ్వాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శ భూమేష్, వ్యవసయా విస్తీరణ అధికారి అశ్విని, రెవెన్యూ అధికారి నిర్మల, గ్రామస్తులు వడ్ల రాజన్న, తూము రాజేశ్వర్, ప్రవీణ్, శ్రీకాంత్, శేరి సురేష్ బాబు, లబ్దిదారులున్నారు.

పిట్టలవాడ వార్డు సభలో రేషన్ అర్హుల మండిపాటు

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని పిట్టలవాడలో నిర్వహించిన వార్డు సభలో కాలనీ వాసులు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న తమ పేర్లు రాలేదని అధికారులపై మండిపడ్డారు. మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో ఇప్పటికే మూడు సార్లు చేశామన్నారు. గతంలో ఇచ్చిన వాటి గురించి చెప్పాలని పట్టుపట్టారు. ఇప్పటికే మీసేవ, ప్రజాపాలన, ఆన్లైన్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నామన్నారు. కానీ లిస్టులో తమ పేర్లు లేవన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వేలో విచారించిన లిస్టులో మాత్రం పేర్లు రాలేదన్నారు. ఎదో అధికారులు వచ్చాము.. సభ నిర్వహించాము అని కాకుండా ప్రజల సమస్యలను పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రజలను సముదాయించే ప్రయత్నం చేసిన వినలేదు. మరోసారి వార్డు సభలో దరఖాస్తు చేసుకుంటే అర్హులకు వచ్చేలా తమ వంతుగా కృషి చేస్తామని చెప్పారు.

తలమడుగు : మండలంలోని పలు గ్రామాలలో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల్లో ప్రత్యేక అధికారులతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొనగా మొదటగా లబ్దిదారుల వివరాల జాబిత గ్రామపంచాయతీ రైతు వేదికల్లో అతికించడంతో అందులో కొంతమంది పేర్లు లేవు. దీంతో అధికారులను లబ్దిదారులు నిలదీశారు. వారికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలపడంతో కాంగ్రెస్ నాయకులు సైతం ప్రభుత్వానికి అండగా నిలవడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు వచ్చాయి. ఓ దశలో కొట్టుకునే వరకు వెళ్లారు. అక్కడే ఉన్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్ వారిని సముదాయించారు. రుయ్యాడి, సుంకిడి గ్రామాల్లో గోడవల మధ్య సభను ముగించారు. అయితే లబ్దిదారులు మాత్రం జాబితలో ఎంత మందికి ఇస్తారో స్పష్ట ఇవ్వాలని పట్టుబట్టారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని సముదాయించడంతో గ్రామ సభ సజావుగా సాగింది. ఇందులో మండల ప్రత్యేక అధికారి గజానంద్, గ్రామప్రత్యేక అధికారి వినోద్ కుమార్, ఏఈఓ స్ఫూర్తి, పంచాయతీ కార్యదర్శి సచిన్, ట్రైనింగ్ ఎస్సై పూజ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ : అధికారులను ప్రశ్నిస్తున్న పిట్టలవాడ ప్రజలు

ఆడపిల్లలు చదువుకుంటేనే భవిష్యత్తు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆడ పిల్లలు చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని జిల్లా సంక్షేమ అధికారిణి సబిత అన్నారు. బేటి బచావో.. బేటి పడవో కార్యక్రమాన్ని ప్రారంభించి పదేండ్లు పూర్తి అయిన సందర్భంగా బుధవారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ చౌక్ మీదుగా ర్యాలీ జిల్లా పరిషత్ సమావేశ మందిరానికి ఈ ర్యాలీ చేరుకుంది. జడ్పీలో జ్యోతి ప్రజ్వలన చేసి ఆడ పిల్లల చదవు ప్రాముఖ్యత గురించి తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు సంతకాలు చేశారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారిణి సబిత మాట్లాడుతూ లింగవివక్షత కారణంగా కడుపులోనే ఆడ పిల్లలను చంపుతున్న సంస్కృతి పెరిగిన క్రమంలో పదేండ్ల క్రితం ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆడ పిల్లల రక్షణ కోసం బేటి బచావో.. బేటి పడవో అనే నినాదంతో పదేండ్ల క్రితం ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆడ పిల్లల రక్షణ కోసం 1098, మహిళాల కోసం 181 లాంటి టోల్ ఫ్రీ నంబర్లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఆడ పిల్లలు చదువుకుంటే ఆ కుటుంబ భవిష్యత్తు మారుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీసీపీఓ రాజేంద్రప్రసాద్, యశోధ, స్వచ్చంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు ఆందోళనకు గురికావొద్దు

- గ్రామ సభలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి



నార్నూర్‌లో..

నవతెలంగాణ-నార్నూర్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, లిస్టులో పేరు రాని వారు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని తహసీల్దార్ రాజలింగం, సుపరింటెండెంట్ గంగాసింగ్ అన్నారు. బుధవారం మండలంలోని గుండాల, మరప్పగూడ గ్రామపంచాయతీలో వేర్వేరుగా గ్రామ సభ నిర్వహించి దరఖాస్తు స్వీకరించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులకు ఎంపిక కాని వారు ఉంటే మళ్లీ గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్ : నిర్మల్ మండలంలోని ముజ్గి గ్రామంలో జరిగిన ప్రజా పాలన గ్రామ సభలో నిర్మల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎంబరి గంగాధర్ పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఇప్పుడు ప్రకటించిన జాబితాలో పేర్లు లేని వారు భయపడనవసరం లేదన్నారు. ఈ గ్రామ సభలో పేరు లేని వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నిర్మల్ : అర్హులైన ప్రతీ ఒక్కరూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. బుధవారం పట్టణంలో వార్డు నెం.17 ఆస్రా కాలనీలో నిర్వహించిన వార్డు సభలో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించారు. లబ్దిదారుల పేర్లు జాబితలో లేకుండా మళ్లీ దరఖాస్తు చేసుకునేల అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వెంట కౌన్సిలర్ అన్వర్ పాషా, సంబంధిత అధికారులు, వార్డు ప్రజలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులున్నారు.



నిర్మల్ రూరల్



నిర్మల్

సర్వే, ల్యాండ్ రికార్డు కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సర్వే ల్యాండ్ రికార్డు ఆదిలాబాద్ జిల్లా శాఖ ఎన్నికలను బుధవారం జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డు కార్యాలయంలో నిర్వహించారు. దీనికి ఎన్నికల అధికారిగా టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు సంద అశోక్ వ్యవహరించగా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. సర్వే ల్యాండ్ రికార్డు జిల్లా అధ్యక్షులుగా పి.గోవింద్, కార్యదర్శిగా ఆర్.అలోప్ సింగ్ ఎన్నికయ్యారు. సహా అధ్యక్షులుగా డి.బాపు రావు, డి.సునంద, బి.గంగారాం, సంయుక్త కార్యదర్శిగా ఎ.ప్రసాద్, కోశాధికారిగా బి.నరేందర్, కార్యవర్గ సభ్యులుగా కె.తారచంద్, జి.అఖిల, కె.సాయికుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గం 3 సంవత్సరాల కాల పరిమితి ఉంటుందని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు సంద అశోక్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకూ నియామక పత్రాలు అందజేసి సన్మానించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర, సభ్యులు తీర్మల్ రెడ్డి, రాజు, అరుణ్, చంద్ర శేఖర్, సర్వెయ్యర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో పారిశుధ్య పనులు



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నర్సాపూర్-జి మండల కేంద్రంలోని వివిధ వార్డుల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. మురుగు కాలువలను శుభ్రం చేసి ఎప్పటికప్పుడు తీసిన మట్టిని పంచాయతీ కార్మికులు తొలగించారు. ఈ సందర్భంగా పట్వారి చాట్ల శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు తమ వంతు బాధ్యతగా గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను మురుగు కాలువల్లో వేయకుండా చెత్త బండిలో వేయాలన్నారు.

విద్యా సంస్థల్లో రాజ్యాంగ పీఠికను చదివించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విద్యా సంస్థలలో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిరోజు ప్రార్థనలో భాగంగా చదివించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలంలోని పోస్ట్ బాక్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లక్ష పోస్టుకార్డుల ఉద్యమంలో భాగంగా ఉత్తరాలను పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం భారత రాజ్యాంగ అమలైన రిపబ్లిక్ డే రోజు జనవరి 26న జాతీయ జెండా వద్ద భారత రాజ్యాంగ గ్రంథంతో పాటు డా.అంబేడ్కర్ చిత్రపటాన్ని అక్కడ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిరోజూ విద్యా సంస్థలలో విద్యార్థులు చదివే ప్రార్థనా స్థానంలో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞగా చదివించాలని కోరారు. ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలను కూడా ఆదేశించాలని డిమాండ్ లేఖని తెలంగాణలోని లక్ష మంది పౌరుల ద్వారా సీఎంకు పంపించడం జరుగుతుందన్నారు. త్వరగా అమలు నిర్ణయయాన్ని జీఓ తీసుకురావాలన్నారు. లేనిపక్షంలో దశాలవారు ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ, బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యాధికార జేఏసీ నాయకులు లక్ష్మణ్, అడెల్లు, సుష్మ, వెంకటేష్, రాజేశ్వర్, సంతోష్, గణేష్, నవీన్, రమేష్, సాయి, శ్రీనివాస్, మధు, రమేష్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి పూర్తి కృషి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణ అభివృద్ధికి తన వంతు పూర్తి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని దుర్గానగర్ కాలనీలో టీఎస్ఎఫ్డీసీ నిధులతో సైడ్ డ్రైన్ పనులకు భూమి పూజ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకువస్తామన్నారు. వార్డుల వారీగా ప్రాధాన్యతను బట్టి దశాలవారీగా అభివృద్ధి చేపడుతామన్నారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రఘుపతి, నాయకులు రాజన్న, సుధాకర్ ఉన్నారు.

అవసరమైన చోట ముందుకొచ్చి సేవలు అందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సేవ కార్యక్రమాల్లో ముందుకు వచ్చి అవసరమైన చోట సేవలు అందించాలని ఆర్యవైశ్య యూత్ అసోసియేషన్ నాయకులు అన్నారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.70 వేల విలువ గల ఏసీ డెడ్ బాడీ ఫ్రీజర్‌ను తిర్పెల్లి స్మశాన వాటికకు అందించారు. ప్రతి ఒక్కరు సామాజిక సేవలో రాణించాలని కోరారు. తమ వంతుగా స్మశాన వాటికకు ఫ్రీజర్‌ను ఇచ్చామన్నారు. పట్టణ ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆనంద్ ఉత్తర్వార్, ప్రధాన కార్యదర్శి వికాస్ ఉత్తర్వార్, కోశాధికారి కిరణ్ కుమార్ చింతవార్, అసోసియేట్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్, ఉపాధ్యక్షులు కపిల్, గణేష్, సాయిక్రిష్ణ, సాయి సంతోష్, రాయిపెల్లి దత్త పాల్గొన్నారు.

మట్కారాయున్ని పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మట్కా ఆడుతున్న యువకుడిని పట్టుకున్నట్టు సీఐ పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంగళవారం సమాచారం మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్లో ఆకస్మిక తణిఖీలు చేశారు. పోతుల సాయికిరణ్ తన ఇంటి వద్ద ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మట్కా ఆడుతున్నాడు. పోలీసులు పట్టుకోని అతని వద్ద ఉన్న మట్కా చిట్టీలు, మొబైల్ ఫోన్, కెమెరా స్టాండ్, ఒక ప్రింటర్, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ మట్కా, జూదం ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. మాట్కా జూదం గురించి సమాచరం ఇవ్వాలని కోరారు.

కేసుల్లో పట్టుకున్న గంజాయి దహనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 53 కేసులలో పట్టుకున్న రూ.74 లక్షల విలువగల 117 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ కరీంనగర్ జిల్లా మానకొండూరు వద్దగల వెంకటరమణ ఇన్సినిరేటర్స్ సెంటర్ వద్ద దహనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అగ్ని ప్రమాదాల నుండి రక్షణకు అవసరమైన పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. ఆసిఫాబాద్ అగ్నిమాపక శాఖకు మంజూరైన రెండవ అగ్నిమాపక వాహనాన్ని ఎమ్మెల్యే కోవలక్ష్మి, జిల్లా ఫైర్ అధికారి సురేష్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెండు అగ్నిమాపక కేంద్రాల్లో ఇప్పటికే రెండు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తాజాగా ఇంకొకటి అందుబాటులోకి రావడంతో అగ్ని ప్రమాదాలు నివారణ సాధ్యమవుతుందన్నారు. రానున్న వేసవిలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ ఇన్స్‌పెక్టర్ కార్తిక్ యాదవ్, కాగజ్‌నగర్ స్టేషన్ ఫైర్ అధికారి భీమయ్య, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, సిబ్బంది సతీష్, శ్రీనివాస్, కుమార్, శరత్, మహేష్, నరసింగరావు, శివ, శ్రీకాంత్, నవీన్, నరేష్, ప్రవీణ్, రాజేష్ పాల్గొన్నారు.

నియామకాలను పారదర్శకంగా చేపట్టాలి



నవతెలంగాణ-కెరమెరి

కేజీబీవీ పాఠశాల ఖాళీలను పారదర్శకంగా చేపట్టాలని ఆదివాసీ విద్యార్థి సంఘం మడవి భరత్ భూషణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో నాన్ టీచింగ్, అవుట్ సోర్సింగ్‌లో బోధకులు, ఏఎన్ఎం ఉద్యోగాల భర్తకి దరఖాస్తులను స్వీకరించారన్నారు. ఈ నియమకాలను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలన్నారు. అర్హులైన స్థానిక అభ్యర్థులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పుషం భీంరావ్, తోడోసం జగనాథ్, విద్యార్థి సంఘ నాయకులు అడ అనంద్ పాల్గొన్నారు.

ఘనంగా బాల రాముని వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అయోధ్యలో బాలరామున్ని ప్రతిష్ఠించి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో శ్రీరామ హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రామాలయం నుండి భారీ రాముని విగ్రహంతో పెద్ద ఎత్తున ప్రజలు ప్రధాన రహదారి గుండా ర్యాలీగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇంటి వరకు చేరుకొని అక్కడి నుండి ప్రధాన వీధుల గుండా రామాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ హిందూ పరిరక్షణ సమితి కన్వీనర్ ఇరుకుల ఆంజనేయులు, సభ్యులు చందు, బోనగిరి సతీష్ బాబు, విశాల్, కోటేశ్వర్, నవీన్, ప్రసాద్ గౌడ్, ఇరుకుల మంగ, ప్రణయ్, కోట వెంకన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని కనికి గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో నాణ్యత లోపం లేకుండా చూడాలని సూచించారు. రూ.5 లక్షల అంచనాతో రోడ్డు పనులు చేపట్టామన్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా మండల నాయకులు బండి రాజేందర్ గౌడ్, ఎల్ములు మల్లయ్య, మేకల తిరుపతి, తిరుపతి గౌడ్, నాయకులు, కార్యకర్తలున్నారు.

దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దివ్యాంగులు ఆర్థిక స్వావలంబనతో సాధారణ జీవనం గడిపేందుకు వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను స్థాపించుకొని జీవనోపాధి పొందేందుకు ఉపాధి, పునరావాస పథకం అమలు చేయడం జరుగుతుందని జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ లింకేజీ లేకుండా నేరుగా రూ.50 వేలు అందించడం జరుగుతుందని, 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 16 యూనిట్ల ద్వారా రూ.8 లక్షల రాయితీ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ఆన్‌లైన్ ద్వారా జరుగుతుందన్నారు. అభ్యర్థులు కనీసం 40 శాతం దివ్యాంగత్వం, 21-55 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, వార్షిక ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాలలో రూ.లక్ష50 వేలు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షలకు మించి ఉండరాదని, 5 సంవత్సరాల కాలంలో ఈ పథకం క్రింద లబ్ధిపొంది ఉండకూడదని తెలిపారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటారని, సాంకేతికత పరిపక్వత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వివరించారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఇటీవల తీసుకున్న ఆదాయ, నివాస, వయస్సు ధృవీకరణ పత్రాలు, విద్యార్హత, పాస్‌పోర్ట్ సైజ్ ఉండాలన్నారు. అర్హత గల దివ్యాంగులు ఈ నెల 23 నుండి ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీఓబీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమృత్ 2.0తో కాగజ్‌నగర్ పట్టణాభివృద్ధి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 కింద ఎంపికైందని, దీనితో పట్టణాభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు విడుదల కానున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణాభివృద్ధికి సర్వే ఆఫ్ ఇండియా అధికారులు డ్రోన్ ద్వారా సర్వే చేపట్టారు. ఈ సర్వే పరిశీలనకు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా హాజరయ్యారు. కాగజ్‌నగర్ పట్టణాన్ని పూర్తి స్థాయిలో సర్వే చేపట్టేందుకు డ్రోన్‌ను ఉపయోగించారు. ఈ సర్వేను పరిశీలించినంతరం కలెక్టర్ మాట్లాడుతూ పట్టణం 8 చదరపు కిలో మీటర్లు కలిగి ఉందని, దీనిని 8 భాగాలుగా విభజించి డ్రోన్ ద్వారా చిత్రీకరించి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. దీనితో పట్టణాభివృద్ధికి అవకాశముందన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2.0 కింద పట్టణం ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. సర్వే ఆఫ్ ఇండియా అధికారులు డిజిటల్ మ్యాప్ సిద్ధం చేసి అందిస్తే మాస్టర్ ప్లాన్ రూపొందించి కేంద్ర ప్రభుత్వం నుండి అధిక మొత్తంలో నిధుల విడుదలకు తాను కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం నిరంతర పోరాటం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కార్మిక హక్కుల కోసం నిరంతరం సీఐటీయూ పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ తెలిపారు. కార్మిక సంఘంలో సభ్యులుగా చేరాలని కోరారు. బుధవారం పట్టణంలోని త్రిశూల్ పాడుపైన జిల్లా ఐకేపీ వీఓఏల ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు బుద్దు అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడుతున్న ఏకైక కార్మిక సంఘం సీఐటీయూ అని తెలిపారు. దేశంలోనే అత్యధిక సభ్యత్వంతో అగ్రగామి కార్మిక సంఘంగా ముందుందని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతాలలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పోటీచేసిన వారిని గెలిపిస్తున్నారన్నారు. నేటికీ అంగన్‌వాడీ, ఆశాలు, గ్రామ పంచాయితీ, భవన నిర్మాణ, రవాణ రంగ కార్మికుల హమాలీ, మున్సిపల్, జిల్లాలోని అనేక రంగాల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. జిల్లాలో గిరిజన ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు కోసం నిరంతరం ఉద్యమాల నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐకేపీ వీఓఏలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.18 వేలు, ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యాలు ఐకెపి వీఓఏలకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం వీఓఏల సమస్యలను చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జె.రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమాచారి, ఐకేపీ వీఓఏల జిల్లా ప్రధాన కార్యదర్శి రోజా, కోశాధికారి ధనరాజ్, సునీత, రమ్య, పద్మ, మహేశ్వరి, స్వప్న, సంతోష్, తిరుపతి, అంకన్న, మల్లేష్, హనుమంతురావు, భరత్, రవీందర్ పాల్గొన్నారు.

అర్జీదారులతో కలిసి ఎమ్మెల్యే ధర్నా

- కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని లింగాపూర్ మండలానికి చెందిన చిన్నదాంపూర్, లొద్దిగూడ, కిమ్ నాయక్ తాండకు చెందిన రైతులు ప్రజలు పట్టాలు, పాసుబుక్‌లు ఇతర అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సంప్రదించారు. దీంతో ఎమ్మెల్యే రైతులతో కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్ళగా పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. దీంతో రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వరరావు అక్కడికి చేరుకొని పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేసిన రైతుల సమస్య తీర్చే వరకు కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ వద్ద అనుమతి తీసుకున్న తర్వాతనే ప్రజలతో కలిసి కలెక్టరేట్‌కి వచ్చామని కానీ పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే అయిన తనకు ప్రజల సమస్యలు తీర్చే పరిస్థితి లేదా అని ప్రశ్నించారు. కలెక్టర్ వచ్చి రైతులకు హామీ ఇచ్చేవరకు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. రెండు గంటల పాటు ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ అనుమతి ఇవ్వడంతో ప్రజలు రైతులకు కలిసి కలెక్టర్‌కు వారి సమస్యలు విన్నవించారు. అయితే ఎటువంటి ఘర్షణ జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం



నవతెలంగాణ-కౌటాల

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు. బుధవారం కౌటాల సబ్ స్టేషన్‌లో విద్యుత్ అదాలత్‌ను నిర్వహించారు. వినియోగదారులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వినతి రూపంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు లేకుండా మెరుగైన రీతిలో విద్యుత్ సరఫరా అందించేందుకు సిబ్బంది, అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ఎటువంటి సమస్యలున్న పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. ఎటువంటి సందేహాలున్న సంప్రదించాలని కోరారు. రైతులు, వినియోగదారులు బిల్లులు, కనెక్షన్‌లను త్వరగా పొందేలా చూడాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యమన్నారు. ఈ వేదికలో టెక్నికల్ మెంబర్ సలంద్ర రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ లకవత్ కిషన్, మర్రిపల్లిరాజా గౌడ్, ఏడీఈ రాజేశ్వర్ ఉన్నారు.

ప్రతి లబ్దిదారునికి పథకాలు అమలుచేస్తాం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ డేవిడ్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులు పథకాలపై అందరికి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికి పథకాలు అందేవిధంగా చూస్తామని, లబ్ధిదారులు బయపడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో అధికారులు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

కెరమెరి : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ అన్నారు. ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పథకాల అర్హుల ఎంపిక కోసం బుధవారం మండలంలోని మెట్ట పిప్రి గ్రామంలో నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. జాబితాలో పేరు రానివారు ఆందోళన చెందొద్దని, మళ్ళీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో మెట్ట పిప్పిరి ప్రత్యేక అధికారి ఆడే ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వ్యవసాయ విస్తరణ అధికారిణి ప్రభావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆంగ్ల భాష సామర్థ్యాలు పెంచేలా కృషి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులో ఆంగ్ల భాష సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి సూచించారు. గిరిజన పాఠశాలల్లో ఆంగ్ల భాష సామర్థ్యాలు పెంపు కోసం విభా లీప్ ఏ వార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోవాడ్ ఆశ్రమ పాఠశాలలతో పాటు జిల్లా కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు విద్యార్థుల ప్రగతి, ఆంగ్ల భాష బోధన పద్ధతులు అమలుపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమీక్షించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆంగ్లభాష సామర్థ్యాలు పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసీఎంఒ ఉద్ధవ్, విభా ప్రోగ్రామ్ మేనేజర్ వీరనారాయణ, ఎల్ఎఫ్‌డబ్ల్యూ టీం సభ్యులు ప్రశాంత్, లక్ష్మణ్, విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కర్ణు, తిరుపతి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-కెరమెరి

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని సావర్ఖేడ గ్రామంలో శ్రీశ్రీ పరమహంస సద్గురు పులాజి బాబా ధ్యాన కేంద్ర 11వ వార్షికోత్సవంలో పాల్గొని ఆధ్యాత్మిక గురువు మాటలను గుర్తు చేశారు. మనలో విశ్వం ఉంది. విషయంలో మనం ఉన్నాము. మనలో విశ్వం ఉంది అదే ఈశ్వర స్వరూపమని పులాజి బావ చెప్పిన బోధనలు ఎంతో మందికి స్ఫూర్తినిచ్చాయని ఎమ్మెల్యే అన్నారు. జ్ఞానం అనేది ఎప్పటికీ నిర్జీవంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవచింతనతో నడవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలన్నారు. ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం ద్వారానే మానసిక ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. నేటి సమాజంలో మనుషుల నడుమ అభిమానం, ఆప్యాయత సన్నగిల్లుతున్నాయన్నారు. సాటి మనిషిని ప్రేమించలేని స్థితిలో మనుషులు మనగడ సాగిస్తున్నారన్నారు. ఆధ్యాత్మికత ద్వారా మానవునిలో శాంతి సహనం, అలవడి తద్వారా సుఖశాంతులతో జీవించగలుగుతారని వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సెడ్మకి ధృపతబాయి, మాజీ వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

తరలి వచ్చిన భక్తులు

సావర్ ఖేడ గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ సంత్ సద్గురు పూలజీ బాబా 11వ వార్షికోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాబా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా కీర్తనలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది.

పది ఫలితాల్లో జిల్లాను మెరుగైన స్థానంలో ఉంచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు జిల్లాను మెరుగైన స్థానంలో ఉంచేల సాధనలు చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆసిఫ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారంలో భాగంగా స్థానిక జడ్పీఎస్ఎస్ బాలురు, బాలికలతో పాటు జనకాపూర్ జడ్పీఎస్ఎస్, ఆదర్శ పాఠశాలల్లో అల్పాహారాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఆత్రం వినోద్, రాపర్తి కార్తీక్, సాయి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు ప్రదీప్ తానికల్, జీవన్ పాల్గొన్నారు.

బడీడు పిల్లల సర్వే

నవతెలంగాణ-కౌటాల

మండలంలో బుధవారం బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ ముత్తంపేట్ పరిధిలోని కుంబారి ముత్తంపేట్ గ్రామంలో సీఆర్పీ గంధం ప్రకాష్ బడి బయట పిల్లల గుర్తింపు సర్వే చేశారు. ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | జనవరి 23, 2025 | www.navatelangana.com

సీనియర్ అసిస్టెంట్‌ను సన్మానించిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్



జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఫైనాన్స్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కన్నం సాంబయ్యను శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో రెస్క్యూ మెంబర్‌గా గత 25 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నందుకు గాను దన్‌బాద్‌లో జరిగిన డీజీఎంఎస్, బీసీసీఎల్ ఆధ్వర్యంలో జరిగిన 53వ భారతీయ రెస్క్యూ కాంపిటీషన్‌లో సాంబయ్యను సన్మానించడం అభినందించదగిన విషయమని తెలిపారు. ఇదే విధంగా సింగరేణిలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులు రెస్క్యూలో చేరడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, ఫైనాన్స్ విభాగ అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థికి ప్రథమ స్థానం

నవతెలంగాణ-జన్నారం



జిల్లా స్థాయి ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్షలో మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థి జాడి ఆంజనేయ ప్రసాద్ విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచాడని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య విద్యార్థికి సర్టిఫికెట్, మెమొంటో అందజేశారు. డీఈఓ మాట్లాడుతూ కలమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయ సిబ్బంది కృషి ఫలితంగా మంచి ఫలితాలు వస్తున్నాయని అభినందించారు. ఇదే స్ఫూర్తితో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గిజనుల నిరసన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కామన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాయకపు గుడా గిరిజనులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఆ గూడెంలో దాదాపు 20 కుటుంబాలు ఉంటాయని ప్రస్తుతం జరుగుతున్న ప్రజాపాలన గ్రామసభలకు తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఆ గూడెంలో ఒకరికి కూడా ఇందిరమ్మ ఇల్లు గాని రేషన్ కార్డులు గానీ ఏ ఇతర ప్రభుత్వ పథకాల జాబితాలో తమ పేర్లు లేవన్నారు. అధికారులను అడిగితే నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నారని తెలిపారు. వెంటనే తమ గూడెం గిరిజనులను ప్రభుత్వం అధికారులు దృష్టిలో ఉంచుకొని తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గంగన్న పోషణ నాయక్‌గూడా గ్రామ గిరిజన మహిళలు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో నిర్వహించబోవు 76వ గణతంత్ర వేడుకలకు పనులన్నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్ వి సూర్యనారాయణ అన్నారు. బుధవారం ప్రగతి స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణతంత్ర వేడుకల పనులను ఆయా విభాగాల అధిపతులు చూసుకోవాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలల్లో పాల్గొన్న వారందరికీ కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించాలని, అలాగే శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేయబడిన వారికి సన్మానం, మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ వేడుకలలో ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పుర ప్రజలు అందరూ పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకలను దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, డీజీఎం వర్క్ షాప్ రవీందర్, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ గుండె రావు పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్‌కు సన్మానం



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం సాయంత్రం మంచిర్యాల కేంద్రంలో జరిగిన ప్రజాస్వామ్యం మీడియా బాధ్యత అనే సెమినార్‌కు వచ్చిన ఆయనను మండల జర్నలిస్టులు శాలువాతో సత్కరించారు. సత్కరించిన వారిలో మండల జర్నలిస్టులు చిలువేరు నర్సయ్య వెంబడి మల్లేశం, గాజుల లింగన్న, గడ్డం కిరణ్, జాడి వెంకటయ్య, కస్తూరి సతీష్, నిమిషకవి రాజేందర్, పర్ల శంకర్, యశోద భాస్కర్, వెంకట్, పని రాజు, ఐలవేణి నరసయ్య ఉన్నారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట



మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాధాన్యతపై వివరించారు. అందరూ విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, వాహనాల కాగితాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఖాసీం సాహెబ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సూర్యతేజ, ప్రిన్సిపాల్ శంకర్ పాల్గొన్నారు.

ప్రజా పాలనలో ప్రజలే న్యాయ నిర్ణేతలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

నవతెలంగాణ-తాండూర్



కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రజలే న్యాయ నిర్ణేతలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం మండలంలోని అచ్చులాపూర్ గ్రామంలో అధికారులు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలే న్యాయ నిర్ణయితలుగా గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితాను వెల్లడిస్తున్నామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం గ్రామపంచాయతీ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజమైన లబ్ధిదారుల పేరు జాబితాలో లేకుంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు సంక్షేమం మహిళా సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రూ.24వేల కోట్లతో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పేదలకు. 200 యూనిట్ల ఉచిత కరెంటును అర్హులకు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు అందించే ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీ సంస్థకు ప్రతి నెల ప్రభుత్వం రూ.300 కోట్లు చెల్లిస్తుందన్నారు. రూ.500 కే సబ్సిడీ గ్యాస్ అందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సభలో బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, తాండూరు తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ బెల్లంపల్లి ఏసీపీ ఏ రవికుమార్, తాండూర్ స్పెషల్ ఆఫీసర్ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా, శంకర్ పాల్గొన్నారు.



బెల్లంపల్లి పట్టణంలో కలెక్టర్..

బెల్లంపల్లి పట్టణంలోని 22వ వార్డ్‌లో బుధవారం నిర్వహించన వార్డు సభలో కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డ్‌ల వివరాలను వెల్లడించారు. లబ్ధిదారుల జాబితాలో పేరులేని అర్హులైన లబ్ధిదారుల వద్ద నుండి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. మొదటి దశలో సొంత స్థలం కలిగి ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే ప్రజా పాలన గ్రామసభలలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికన్నష్ణ, ఏసీపీ రవికుమార్, మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేతా, డిప్యూటీ తహసీల్దార్ కల్పన, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు,

ప్రజాస్వామ్య పార్టీలన్నీ ఏకం కావాలి

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-మంచిర్యాల



ఇప్పటికైనా మన దేశంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష వాదులు ప్రజాస్వామ్య పార్టీలు ఏకమై ముందుకు సాగితేనే రాజ్యాంగాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగం రవి ఆధ్వర్యంలో స్థానిక ప్రయివేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చడమే ఏకైక లక్ష్యంగా పని చేస్తుందన్నారు. రాజ్యాంగంలో ఉన్న సెక్యులరిజాన్ని మార్చాలని అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మతోన్మాదం, హిందూయిజం పేర్లతో ఈ దేశాన్ని ఏలాలనే లక్ష్యంతో మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందుకే దేశంలో సోశలిజం సెక్యూలరిజం అనేది లేకుండా చేసే కుట్రలో బీజేపీ ప్రభుత్వం ఉందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ 1925లో ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ పార్టీ ఆనాటి నుంచి ఈనాటి వరకు దున్నేవానికి భూమి చెందాలనే లక్ష్యంగా సమ సమాజ న్యాయం ఉండాలని ప్రస్తుత సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సెక్యులరిజంతో ప్రజాస్వామ్య యుతంగా ముందుకు వెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, ఖలిందర్ ఆలీ ఖాన్, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, బొల్లం పూర్ణిమ, చిప్ప నరసయ్య, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, కారుకూరి నాగేష్, ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు ముస్కే సమ్మయ్య, బాజీ సైదాలు పాల్గొన్నారు.

పింఛన్ పైసలు ఇంటి పన్నుకు జమ

- నంనూర్ పంచాయతీ అధికారులు నిర్వాకం

నవతెలంగాణ-హాజీపూర్

వృద్ధుల ఆసరా పింఛన్ ఇంటి పన్నుకింద జమ చేసిన సంఘటన మండలంలోని నంనూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వద్దని వేడుకున్న కర్కశంగా వ్యవహరించారు. పంచాయతీ అధికారులు ఈ ఫించన్ పైనే ఆధార పడి బ్రతుకుతుండగా, వృద్ధులు అనారోగ్యాల బారిన పడిన వారు మందు గోలీలకు పించనే ఆధారం కాగా ఈ పించన్ డబ్బులను ఇంటి పన్ను బకాయి పేరుతో దండుకోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. కొందరికి రసీదులు ఇచ్చి ఇంకొందరికి వచ్చే నెల కూడా జమైనంక ఓకె సారి రసీదు ఇస్తామని అన్నారని వృద్ధులు పేర్కొంటున్నారు. చనిపోయిన వారి కుమారుల పేరుపై ఉన్న ఇంటికి సైతం ఇంటి పన్ను వృద్ధుల పింఛన్ నుంచి వసూలు చేయడం వృద్ధులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇలా గ్రామంలో 15 మంది వృద్ధుల ఆసరా పింఛన్ డబ్బులు ఇంటి పన్ను పేరుతో ఆపినట్లు తెలిసింది.

మందులకు పైసలు లేవన్నా కనికరించలేదు

చౌతకారి చంద్రయ్య, నంనూర్



నాకున్న రెండు రూముల రేకుల షెడ్డు పై ఇంటి పన్ను బకాయి వుందని నా పింఛన్ పైసలు ఆపుకున్నారు. పాణం మంచిగా లేదు మందుగోలీలు తెచ్చుకుంటా దయా, దండం అన్న ఇయ్యలేదు. అచ్చే నెల కూడా ఆపుకుంటారట. నెల నెలా వచ్చే ఫించన్ తోనే నేను బ్రతుకుతున్న. నెలకు రూ.500 వరకు మందులకే పోతున్నాయి. అధికారులు నాకు ఫించన్ ఇప్పియ్యగలరు.

గ్రామసభల్లో గందరగోళం

- ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేర్లు లేవని ప్రజల నిలదీత



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టనున్న పథకాలను అర్హులందరికీ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీఓ శశికళ, మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్, ఎంపీ ఈఓ జలంధర్ డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పొనకల్, జన్నారం, ధర్మారం, రేండ్లగూడ, కిష్టాపూర్, ఇంధన్‌పల్లి గ్రామాలలో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించారు. సందర్భంగా రేండ్లగూడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజా పాలనలో రసాభాసగా మారింది. ఆ గ్రామస్తులు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులలో తమ పేర్లు లేవని అధికారులను నిలదీశారు. గ్రామంలో అర్హులు ఉన్నప్పటికీ వారికి రేషన్ కార్డులు అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే ఇస్తున్నారని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు స్పందించి అర్హత ఉన్న వారందరికీ ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందిస్తామని సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజలకు మధ్య కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. అధికారులు సర్ది చెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది. ఆయా గ్రామసభల్లో ఆ అధికార్లు మాట్లాడుతూ, ప్రభుత్వం సదుద్దేశంతో 4 కొత్త సంక్షేమ పథకాలను ఈ నెల 26 నుంచి అమలు చేయనుంద న్నారు. ఆ పథకాల ఎంపికకు గ్రామస భల్లో ప్రజల సమక్షంలో వివరాలు వెల్లడించి అభిప్రా యాలు సేకరించ నున్నట్లు వారు చెప్పారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

ఆర్టిజన్స్‌ను అన్ని విధాల ఆదుకోవాలి



నవతెలంగాణ-మంచిర్యాల

విద్యుత్ శాఖలో గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను బుధవారం కలిసి మాట్లాడారు. సబ్ స్టేషన్, జెన్కో ట్రాన్స్‌కో ఎన్పీడీసీఎల్‌లో ఆర్టిజన్‌లుగా గత 20 సంవత్సరాల నుంచి కార్మికులు పని చేస్తున్నారని, ప్రజలకు, రైతులకు, ఫ్యాక్టరీలకు 24 గంటల విద్యుత్ అందించడంలో ఆర్టిజన్స్ కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి శ్రమను గుర్తించి 2017 జులై 29న 23, 959 మంది ఆర్టిజన్స్‌ను క్రమబద్దీకరించినట్లు తెలిపారు. దానితో సుమారు రూ.30 వేల వేతనం కార్మికులకు అందిందని, ఆర్టిజన్ కార్మికులకు సైతం విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేసి కార్మికుల విద్య అర్హతను బట్టి ఉద్యోగోన్నతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదే సత్యం, నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, ఎడ్ల శంకర్, పల్లపు రాజు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మత్తు పనులు ప్రారంభం



నవతెలంగాణ-మందమర్రి

1వ జోన్ కార్మిక కాలనీలలో రూ.1.10 కోట్ల నిధులతో చేపట్టిన రోడ్డు మరమ్మత్తులను బుధవారం డీవైజీఎం సివిల్ రాములు, బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ ప్రారంభించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతిపాదన మేరకు జీఎం దేవేందర్ రోడ్ల నిధులను మంజూరు చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ అధికారి జయప్రకాష్. శ్రీహరి, బ్రాంచ్ నాయకులు భీమనాథుని సుదర్శన్, పెద్దపెల్లి బానయ్య, ఎగ్గేటి రాజేశ్వరరావు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఈటెలను విమర్శిస్తే సహించేదిలేదు



నవతెలంగాణ-జన్నారం

ముదిరాజ్ ముద్ద బిడ్డ, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను విమర్శిస్తే సహించేది లేదని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య, అఖిల భారత కోలీ సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు బొజ్జ నారాయణ, మహిళా నాయకురాలు గోదావరి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తమ నాయకుడిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది మంది అభిమానులు ఉన్న ఈటెల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సహకార సంఘాల నాయకుల వద్ద కమీషన్లు తీసుకునే వ్యక్తి ఈటెల రాజేందర్‌ను విమర్శించే స్థాయి కాదని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా వెంటనే మాటలను వెనక్కి తీసుకొని ఈటెల రాజేందర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జన్నారం మండల నాయకులు దండ వేణి శ్రీధర్, రవి, కిరణ్, మురళి, రమేష్, తిరుపతి, చంద్రమౌళి, భీమరాజ్, మహిళా నాయకురాలు సలేంద్ర గోదావరి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం

నవతెలంగాణ-నస్పూర్

దివ్యాంగులు ఆర్థిక స్వావలంబనతో సాధారణ జీవనం గడిపేందుకు వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను స్థాపించుకొని జీవనోపాధి పొందేందుకు ఉపాధి, పునరావాస పథకం అమలు చేస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంక్ లింకేజీ లేకుండా నేరుగా రూ.50 వేల అందించడం జరుగుతుందని, 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 23 యూనిట్ల ద్వారా రూ.11.50 లక్షల రాయితీ మంజూరు చేయడం జరిగిందని, లబ్ధిదారుల ఎంపిక ఆన్‌లైన్ ద్వారా జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు కనీసం 40 శాతం దివ్యాంగత్వం, 21-55 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, వార్షిక ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాలలో రూ.1 లక్షా 50 వేల, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షలకు మించి ఉండరాదని, గత 5 సంవత్సరాల కాలంలో ఈ పథకం క్రింద లబ్ధి పొంది ఉండకూడదని తెలిపారు. కుటుంబాన్ని యూనిట్గా తీసుకుంటారని, సాంకేతికత పరిపక్వత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఇటీవల తీసుకున్న ఆదాయ, నివాస, వయస్సు ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతలు, పాస్పోర్ట్ సైజ్ ఉండాలని తెలిపారు. అర్హత గల దివ్యాంగులు ఈ నెల 23 నుండి ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టీఓబీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | జనవరి 23, 2025 | www.navatelangana.com

అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతి

నవతెలంగాణ-మందమర్రి



పట్టణంలోని మార్కెట్ సెంటర్లో గల అక్రమ నిర్మాణాలను తొలగించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్ ఆర్టీసీ మంచిర్యాల డిపో మేనేజర్ కి వినతిపత్రం అందజేశారు. ఉపాధి లేక పొట్టకూటి కోసం ఆర్టీసీ బస్టాండ్ గోడను ఆనుకొని చిన్న టేలలు వేసుకుంటే వాటిని తొలగించడం సరికాదన్నారు. ఎదురుగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

కళాశాలలో సాంస్కృతిక సారధి కళాజాత

నవతెలంగాణ-జన్నారం



మంచిర్యాల జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కళాజాత నిర్వహించి రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనదారులందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని అన్నారు. మైనర్స్ కు వాహనాలు ఇవ్వకూడదని రోడ్డు భద్రత నియమాలను పాటించి సురక్షితమైన గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ కిషోర్ చంద్ర, ఆర్టిఏ అంకతి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే



నవతెలంగాణ-హాజీపూర్

ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే అన్నారు. బుధవారం మండలంలోని నంనూర్, నర్సింగాపూర్, కర్ణమామిడి గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో అధికారులు పాల్గొన్నారు. గృహ లక్ష్మి, రేషన్ కార్డు లబ్ధిదారుల జాబితాను సభ ముందు ఉంచి అభిప్రాయాలు తీసుకున్నారు. లబ్ధిదారుల జాబితాలో అర్హులకు కూడా త్వరలో సంక్షేమ పతకాలు అందుతాయని అధికారులు తెలిపారు. నర్సింగాపూర్ గ్రామ సభలో ఇటీవల గ్రామాన్ని మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపతి సూరేష్, డీటీ హరిత, మండల పశు వైద్యాధికారి శాంతి రేఖ, ఎంపీఓ నజీర్, ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు.

ప్రశ్నలతో సాగిన గ్రామ సభలు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలు ప్రజల ప్రశ్నలతో కొనసాగాయి. గందరగోళం మధ్య అనేక అనుమానలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. కాసిపేట, ముత్యంపల్లి, దేవాపూర్ తదితర గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం గ్రామ సభలు నిర్వహించి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. తమ పేర్లు లిస్ట్‌లో రాకపోవడంతో ప్రజల ఆందోళన చేశారు. అర్హులైన తమ పేర్లు ఎందుకు నమోదు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. అసలు ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు అనేది కూడా కనీసం తెలుపకపోవడం ఏంటని ప్రశ్నించారు. అన్ని శాఖల అధికారులు లేకపోవడంతో సమన్వయ సమస్య ఎదురయిందని, తమ సమస్యలు ఎవరు పరిష్కరించాలని ప్రజలు ప్రశ్నించారు. వీటిపై అధికారులు స్పష్టత ఇవ్వపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు తొందర తొందరగా దరఖాస్తులను స్వీకరించి గ్రామ సభలను ముగించేశారు.

కోతులకు ఆహారం వేసిన వారికి జరిమానా

నవతెలంగాణ-హాజీపూర్

క్వారీ రోడ్డులో కోతులకు ఆహారం వేసిన వారికి జరిమాన విధించారు. అడవీ శాఖ అధికారులు మంచిర్యాల పట్టణానికి చెందిన శివ, జగన్‌లు క్వారీ రోడ్డులో కోతులకు ఆహారం వేస్తుండగా గుర్తించి వారికి కోతులకు ఆహారం వేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. వారికి రూ.4 వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, ఎఫ్ఆర్ఓ సుభాష్, ఎఫ్ఎస్ఓ అతాఉళ్ళ, ఎఫ్‌బీఓలు సంతోష్, రాజేందర్ ఉన్నారు.

మోడల్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుండి 10వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మీ సేవా లేదా ఆన్‌లైన్ కేంద్రాలోల ఫిబ్రవరి 28వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన రాకేష్ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం అందజేశారు.

నీల్గాయిని హతమార్చిన కేసులో ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ-చింతలమానేపల్లి

కర్జెల్లి రేంజ్ పరిధిలో అటవీ జంతువు నీల్గాయిని హత్య చేసిన ఇద్దరిని పట్టుకున్నట్టు ఎఫ్ఎస్ఓ మోహన్ తెలిపారు. కేతిని సెక్షన్‌లోని ముంజంపల్లి గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన తుమ్మిడే శంకర్, బాలేపల్లి రాకేష్ కలిసి పత్తి చేనులలో ఉచ్చుల (డబ్బి) వేసి నీల్గాయిని హత్య చేశారు. మాంసాన్ని విక్రయించినట్టు అటవీ శాఖ అధికారుల విచారణలో తెలింది. దీంతో వారిని అదుపులో తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులు, రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే పేషెంట్ల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. వైద్యులు, సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. అనంతరం ఆయన స్థానిక మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, నూతన మెనూ పట్టికను పరిశీలించారు. వంటలో తాజా కూరగాయలను వాడాలని, వంటగదిలో శుభ్రత పాటించాలని సూచించారు. నూతన మెనూ ప్రకారం పోషకవిలువ కలిగిన ఆహారాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం : ఎమ్మెల్యే వినోద్

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్
- అర్హులందరికీ పథకాల వర్తింపు



నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేసే ప్రభుత్వమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉచిత కరెంట్, గ్యాస్, బస్సు ప్రయాణం అమలులో ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అమలు చేసేందుకు కసరత్తు సాగుతోందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్నారు. నియోజకవర్గంలోని 7మండలాలకు 5909 మంది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపికయ్యారని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పథకంలో భాగంగా వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతుభరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకానికి నియోజకవర్గంలో 51534 మంది రైతులు ఎంపికయ్యారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో రేషన్ కార్డులేని 5883 మంది లబ్దిదారులను గుర్తించామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 39,517 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను అధికారులు గుర్తించారని తెలిపారు. దశల వారీగా ప్రభుత్వ ఫలాలు అర్హులందరికీ అందుతాయన్నారు. మొదటి దశలో వితంతువులు, పారిశుధ్య కార్మికులు, అంగవైకల్యం కలవారు, భూమిలేని నిరుపేదలకు తొలిదశలో అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామనితెలిపారు. అర్హత ఉండి లబ్ధిదారుల జాబితాలో పేరులేని వారు గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవచ్చనని తెలిపారు. అధికారులు అర్జీలు స్వీకరించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, నాయకులు మల్లయ్య, నాతారి స్వామి పాల్గొన్నారు.

ఆడపిల్లల అభివృద్ధికి కృషి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆడపిల్లల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. భేటీ బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కలెక్టరేట్ నుండి జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారిత కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక రక్షణ కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మార్చ్ 8 వరకు ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆడపిల్లలను బతికించుకుందామని, వారిని చదివించుకుని వారి హక్కులను కాపాడుకుందామని, బాలికలను స్వేచ్ఛగా ఎదగనిద్దామని అన్నారు. జిల్లాలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని, పాఠశాలలు, కళాశాలలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు శారద, మమత, రాణి, విద్యార్థినిలు, సిటీ కేంద్రం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి మరింత బాధ్యత పెంచుతుంది



- ఎస్పీ డివి శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యోగంలో ఉద్యోగోన్నతి బాధ్యతను మరింత పెంచుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నుండి ఏఆర్ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో ఉద్యోగోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకం, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు పెద్దన్న, అంజన్న, నాగుల్ మీరా, జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురికి జైలు

కెరమెరి : గంజాయి సాగు, విక్రయాలకు చేస్తు పట్టుబడిన నలుగురు నిందితులకు జిల్లా జడ్జి ఎంవీ రమేష్ పది సంవత్సరాల జైలుతో పాటు రూ.లక్ష జరిమాన విధించారని ఎస్సై గుంపుల విజయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 21.09.2021న సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గోయగాం గ్రామం నుంచి ఆటోలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి కేజీ గంజాయి పట్టుబడింది. ఏ1 కదవండి ప్రవీణ్, ఏ2 గొండ ప్రణయ్, ఏ3 చౌదరి మణికంఠ ముహూర్లే మధుకర్ ఏ4 విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారి సమాచారం మేరకు మొహర్లె మధుకర్ ఇంటిలో రెండు కిలోల గంజాయి, అతని వ్యవసాయ క్షేత్రంలో గంజాయి మొక్కలు లభించాయి. అప్పటి వాంకిడి సిఐ సుధాకర్ ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజపర్చారు. పిపి జగన్మోహన్ రావు సాక్షులను కోర్టులో హాజరుపరిచి నేరం రుజువు చేయడంతో జిల్లా జడ్జి తీర్పు ఇచ్చారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పిపి జగన్ మోహన్ రావు, ప్రస్తుత ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై విజయ్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్ సింగ్, కోర్ట్ సిబ్బందిని ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఒలింపియాడ్‌కు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎ అభివర్ధిని, జి శ్రీవాత్సవ రాష్ట్ర స్థాయి ఆంగ్ల ఒలింపియాడ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. మంచిర్యాలలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ నిర్వహించిన జిల్లా స్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీలో 8వ తరగతి విద్యార్థిని అభివర్ధిని ప్రథమ స్థానంలో, 9వ తరగతి విద్యార్థి శ్రీవాత్సవ ఒలింపియాడ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్ డాక్టర్ జి. సత్యనారయణను ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు ఆంగ్ల ఉపాధ్యాయులు సత్యనారాయణ, అనిత, మల్లేష్ పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

జాతీయ ఆరోగ్య మిషన్ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తలమాద్రి సబ్ సెంటర్ ఎంహెల్‌హెచ్‌పి ప్రశాంత్ అన్నారు. బుధవారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాదిగూడ, దాబా(కె), చించోలి, గేర్జం గ్రామాలలో జానపద కళాకారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మాస్ మీడియా అధికారి రవిశంకర్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్, సంభావ్య వ్యాధులు, జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్, ఇంటిగ్రేటెడ్ డీసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్, నేషనల్ వేక్టర్ బోర్న్ డీసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ లాంటి జాతీయ కార్యక్రమాలు మారుమూల ప్రాంతాల్లో సైతం మెరుగైన వైద్యం సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య బోధకులు వెంకటరెడ్డి, సామాజిక ఆరోగ్య అధికారి బ్రహ్మానందరెడ్డి, పర్యవేక్షకులు ఉత్తమ్, హెల్త్ అసిస్టెంట్ సుభాష్ గ్రామాల ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వాసవి విద్యా మందిర్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి ఎంబీబీఎస్ పూర్తి చేసి ఎండీ జనరల్ మెడిసిన్‌లో సీటు సంపాదించిన మాల్కాడి తిలక్‌కు పూర్వ విద్యార్థులు రూ.82,000 ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ మొదటి నుండి కష్టపడి చదివి వ్యక్తిత్వం గలవారని, ఎంబీబీఎస్ పూర్తి చేసి ఎండీ జనరల్ మెడిసిన్‌లో సీటు సంపాదించడం గర్వకారణమన్నారు. ఇటువంటి విద్యార్థులకు అండగా ఉండడం బాధ్యత అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొట్టుపల్లి సాయి కృష్ణ, ఆకాష్, హరికృష్ణ, సమ్మన్న, సాయి ప్రణీత్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబర్-1 బెల్లంపల్లి వైపు ఒక గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ కే.సురేష్ గౌడ్ తెలిపారు. 55 నుండి 60 సంవత్సరాల వ్యక్తి అనారోగ్యం కారణంగా మరణించి ఉంటాడని తెలిపారు. అతని వద్ద గుర్తింపు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేవని, బ్లూ కలర్ టీ షర్ట్, బూడిద కలర్ పాయింట్, గ్రే కలర్ స్వెటర్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ పీహెచ్‌సీలో భద్రపరచామని, తెలిసిన వారు సెల్ నంబర్ 9948481902, 8712658605కు తెలియజేయాలన్నారు.

పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి



నవతెలంగాణ-రెబ్బెన

పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలని, ఆ దిశగా సంఘాలు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. బుధవారం పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ గోలేటి గౌరవాధ్యక్షులు ఆధ్వర్యంలో సొసైటి క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు పద్మశాలీలు ఆయన్ను సన్మానించారు. పద్మశాలీలు పిల్లలకు విద్యతో పాటు ఆయా రంగాల్లో రాణించేల ప్రోత్సహించాలని, దీనికి సంఘాలు బాధ్యతలు తీసుకోవాలని జీఎం సూచించారు. కార్యక్రమంలో మారిన వెంకటేశ్వర్లు, గుండేడి వీరస్వామి, మారిన చందర్, పొన్న శంకర్, భోగ రవీందర్, హనుమాన్ల సత్యనారాయణ, బూర శ్రీనివాసు, తిప్ప శ్రీనివాస్, బొగ్గిళ్ళ శ్రీనివాస పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాత లైన్ మరమత్తులు పనుల్లో భాగంగా నేడు జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని జంగంవాడ, సైనివాడలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

డివైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డివైఎఫ్ఐ 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్య, వైద్యం ఉపాధి, ఉద్యోగం కోసం అహర్నిశలు ప్రజా సమస్యలపై పోరాడుతూ నిత్యం జనంలో ఉంటూ యువతను మంచిదారిలో నడిపిస్తూ అనేక పోరాటాలు ఉద్యమాలు చేస్తుందన్నారు. యువకుల్లో క్రీడా సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తుందన్నారు. ప్రజలకు సేవలు అందిస్తూ ముందుండాలని యువతను అభివృద్ధి చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టికానంద్, గొడిసెల కార్తీక్, జిల్లా సహా కార్యదర్శి ఆత్మకూరి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి శ్రావణి, దుర్గం నిఖిల్, జిల్లా కమిటీ సభ్యురాలు కుందరపు మంజుల పాల్గొన్నారు.

పంచాయతీలో ఇరువురి మధ్య ఘర్షణ

నవతెలంగాణ-దండేపల్లి

మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన తిరుమలకు, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం ధోనూర్ గ్రామానికి చెందిన కమలాకర్‌కు 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం విషయంలో భార్య, భర్తలకు గొడవలు జరుగుతున్నాయి. గొడవలపై బుధవారం పోలీస్ స్టేషన్ సమీపంలోని సహకార సంఘం భవన ఆవరణలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరుగుతోంది. ఈ క్రమంలో అమ్మాయి తరపు బంధువులు మద్యం తాగి వచ్చి అబ్బాయి తరపు బంధువులు, పెద్దమనుషులపై దాడికి పాల్పడ్డారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. దీనిపై ఎస్ఐ ఉదయకిరణ్‌ను వివరణ కోరగా.. దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.